అమృత్ తెలంగాణ
తెలుగు దిన పత్రిక

## ఒక వ్యవస్థ వుందిగా.. దాన్నే అనుసరిస్తాం!

న్యూఢిల్లీ :అమృత్ తెలంగాణ: వక్ఫ్ (సవరణ) చట్టం రాజ్యాంగ చెల్లుబాటును సవాలు చేస్తున్న పిటిషన్లను త్వరలోనే విచారిస్తామని ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా చెప్పారు. కేసులను అత్యవసరంగా విచారించాలని కోరుతూ పంపే రాతపూర్వక అభ్యర్థనలు లేదా ఇ మెయిల్స్ వంటి వాటిని పరిశీలించేందుకు ఒక పద్ధతి వుందని, దాన్ని కోర్టు అనుసరిస్తుందని జస్టిస్ ఖన్నా చెప్పారు. ప్రధాన న్యాయమూర్తి మొత్తంగా పరిస్థితులనుసమీక్షించి,ఆయా కేసులను బెంచ్‌లకు అప్పగిస్తారన్నారు. ఇవన్నీ చూసేందుకు ఇప్పటికే ఒక వ్యవస్థ అమల్లో వుండగా, మీరెందుకు ప్రస్తావిస్తున్నారని జస్టిస్ ఖన్నా పిటిషనర్ల తరపు న్యాయవాది కపిల్ సిబల్‌ను సోమవారం ప్రశ్నించారు. ఈ పిటిషన్లను సత్వరమే విచారించాల్సిన అవసరం వుందని సమస్తా కేరళ జమైతుల్ ఉలేమా తరపు న్యాయవాదులు ఎ.ఎం.సింఘ్వి, జుల్ఫికర్ అలీ, ఎఐఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసి తరపు న్యాయవాది నిజామ్ పాషా కూడా కోరారు. వక్ఫ్ ఆస్తులపై, వాటి నిర్వహణపైఈచట్టంఏకపక్షంగాఆంక్షలువిధిస్తోందని పిటిషనర్లు పేర్కొంటున్నారు.

## అన్సారీకి మరో ఉద్యోగం ఇవ్వండి

హైదరాబాద్, ఏప్రిల్ 7 అమృత్ తెలంగాణ:: మెహదీపట్నం డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న ఏడు అడుగుల అమీన్‌అహ్మద్ అన్సారీకి ఆర్టీసీలోనే మరో ఉద్యోగం ఇవ్వాలని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌ను ఆదేశించారు. ఈమేరకు ఆయన ఎక్స్‌లో 'సీఎం రేవంత్‌రెడ్డి సూచన మేరకు అన్సారీకి ఆర్టీసీలో మరో ఉద్యోగం ఇవ్వగలరు' అంటూ సజ్జనార్‌కు సూచించారు. ఇటీవల కారుణ్య నియామకం కింద అన్సారీకి కండక్టర్‌గా ఉద్యోగం ఇచ్చారు. అయితే అతని ఎత్తు 7ఫీట్లు కాగా, 6.4 ఫీట్ల ఎత్తున్న బస్సులో డ్యూటీ ఇబ్బందిగా మారింది. దీంతో కొందరు అన్సారీ బాధలు సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో అది వైరలైంది. ప్రభుత్వం స్పందించింది.

సంపుటి: 01 సంచిక : 185. ఎడిటర్: సింగిడి అమృత్ తెలంగాణ మంగళవారం.08.04.2025 పేజీలు:4, వెల:రూ.1.00

# 'కంచ' భూములపై కోర్టు ఉత్తర్వుల పొడిగింపు

హైదరాబాద్, ఏప్రిల్ 7 అమృత్ తెలంగాణ: రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కంచగచ్చిబౌలిలోని 400 ఎకరాల్లో చెట్లను నరికివేయరాదని పేరొంటూ గతంలో జారీచేసిన మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు సోమవారం మరోసారి పొడిగించింది. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టులో కేసు విచారణ జరుగుతున్న దృష్ట్యా విచారణను ఈ నెల 24కు వాయిదా వేసింది. అప్పటివరకు మధ్యంతర ఉత్తర్వులు అమల్లో ఉంటాయని స్పష్టంచేసింది. ఈ నెల 24లోపు కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. తాతాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్, జస్టిస్ రేణుకయారా ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. గచ్చిబౌలిలోని 400 ఎకరాలను టీజీఐఐసీకి కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోను సవాల్‌చేస్తూ, వట ఫౌండేషన్, హైదరాబాద్‌కు చెందిన బాబూరావు, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ స్టూడెంట్స్ యూనియన్లు ప్రజాప్రయోజన వ్యాజ్యాలను దాఖలు చేశారు. ప్రజాశాంతి వ్యవస్థాపకుడు పాల్ కూడా సోమవారం పిల్ వేశారు. వీటన్నింటినీ కలిపి ఈ నెల 24న విచారణ చేపడతామని ధర్మాసనం వెల్లడించింది. వట ఫౌండేషన్ తరఫున సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఇదే వ్యవహారంపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టిందని, తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రీ నుంచి నివేదిక తెప్పించుకుందని తెలిపారు. అటవీ ప్రాంతంలో చెట్ల నరికివేత చర్యలను నిలిపివేయాలని మధ్యంతర ఆదేశాలు ఇచ్చిందని చెప్పారు. దీంతోపాటు చెట్ల నరికివేతకు అవసరమైన అనుమతులు తీసుకున్నదీ లేనిదీ సమగ్ర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శిని ఆదేశించిందని చెప్పారు. కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ప్రవీణ్‌కుమార్ వాదిస్తూ, కంచగచ్చిబౌలి భూముల్లో ఏం జరిగిందో రాష్ట్ర



ప్రభుత్వం స్థాయీ నివేదిక సమర్పించేలా ఆదేశాలివ్వాలని హైకోర్టును కోరారు. రాష్ట్ర అటవీశాఖ తరఫున సీనియర్ న్యాయవాది మేనక గురుస్వామి వాదనలు వినిపిస్తూ, టీజీఐఐసీకి భూమి కేటాయింపును వ్యతిరేకిస్తున్న వాళ్లు, ఆ భూముల్లో నెమళ్లు, జింకలు పారిపోతున్నట్టు నకిలీ వీడియోలు సృష్టించి తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వీటిపై నివేదిక సమర్పించాలని పోలీసులను ఆదేశించాలని కోరగా, హైకోర్టు నిరాకరించింది. ప్రస్తుతం వివాదం సుప్రీంకోర్టులో లో ఉన్నదని, అకడ నిర్ణయాన్ని బట్టి ఇకడ విచారణ చేపడతామని స్పష్టంచేసింది. సుప్రీ ంకోర్టు విచారణ ఈ నెల 16న జరగనున్నందున ఇకడి వ్యాజ్యాలపై విచారణను ఈ నెల 24కు వాయిదా వేస్తున్నట్టు ప్రకటించింది.

## పెట్రోల్ ధరలో ఎలాంటి మార్పు ఉండదు.. క్లారిటీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం

అమృత్ తెలంగాణ: పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీని రూ.2 పెంచుతూ కేంద్ర ప్రభుత్వం తాజాగా నిర్ణయం తీసుకుంది. దీంతో పెట్రోల్ ధరలు పెరుగుతాయని వాహనదారులు భావించారు. అయితే ఈ ఎక్సైజ్ డ్యూటీ పెంపు భారం సామాన్యులపై ఉండబోదని కేంద్ర ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది. ఎక్సైజ్ సుంకం పెంపును ఆయిల్ కంపెనీలే భరిస్తాయని కేంద్ర ప్రభుత్వం వివరణ ఇచ్చింది. సామాన్యులకు పెట్రోల్ ధరలో ఎలాంటి మార్పు ఉండదని స్పష్టం చేసింది. ఈ మేరకు పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ ట్విట్టర్(ఎక్స్) వేదికగా క్లారిటీ ఇచ్చింది. మరోవైపు అమెరికా –చైనా ట్రేడ్ వార్, ఆర్థిక మాంద్యం భయాలు, ఒపెక్ ప్లస్ ఉత్పత్తి పెంపు వంటి



అంతర్జాతీయ ఆర్థిక భయాల నేపథ్యంలో కొంతకాలంగా క్రూడాయిల్ ధరలు భారీగా పతనం అవుతున్నాయి. వారం వ్యవధిలోనే సుమారు 10 డాలర్ల వరకు తగ్గి.. ఇప్పుడు మూడేళ్ల కనిష్ట సాయికి చేరింది. అయినప్పటికీ దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరల్లో ఎలాంటి తగ్గింపు జరగలేదు. అంతర్జాతీయంగా ముడి చమురు ధరల తగ్గింపు నేపథ్యంలో ఇప్పటికైనా పెట్రోల్ ధరలు తగ్గుతాయేమోనని ఎదురుచూస్తున్న సామాన్యులపై కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ డ్యూటీ పెంపు పేరుతో షాకిచ్చింది.

# జీవో నెం.21 వెనక్కి తీసుకోవాలి

మహబూబ్‌నగర్ ఏప్రిల్ 7 :అమృత్ తెలంగాణ: జీవో నెం.21 వెంటనే వెనక్కి తీసుకోవాలని పాలమూరు యూనివర్సిటీ ఒప్పంద అధ్యాపకులు డిమాండ్ చేశారు. సోమవారం పీయూ పరిపాలన భవనం ఎదుట పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. ప్రభుత్వ జీవో ఉత్తర్వు జిరాక్స్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం యూనివర్సిటీల్లో సహాయ ఆచార్యుల నియామకం కోసం విడుదల చేసిన జీవో నెంబర్ 21ను తక్షణమే రద్దు చేయాలన్నారు. ఈ మేరకు వీసీ శ్రీనివాన్, రిజిస్ట్రార్ రమేశ్‌బాబును కలిసి ఒప్పంద అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాకే మిగిలిన పోస్టులను నియమించాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం



వారు మాట్లాడుతూ ఎన్నో ఏండ్లుగా యూనివర్సిటీని నమ్ముకొని పనిచేస్తున్నామని, జూనియక్ లెక్చరర్లు, డిగ్రీ లెక్చరర్లను క్రమబద్ధీకరించినట్లే యూనివర్సిటీ ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఒప్పంద అధ్యాపకుల సంఘం నాయకులు భూ మయ్య, రవికుమార్, శ్రీధర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, వెంకటేశ్, కరుణాకర్‌రెడ్డి, రవికాంత్, విజయ్‌భాస్కర్, సోమేశ్వర్, శ్రీనివాస్, జంగం విశ్వనాథ్, బషీర్ అహ్మద్, ఆంజనేయులు పాల్గొన్నారు.

# గులాబీ జోష్.. బీఆర్ఎస్ ఆవిర్భావ వేడులకు ఏర్పాట్లు

అమృత్ తెలంగాణ: బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకల ఏర్పాట్లలో గులాబీ దండు నిమగ్నమైంది. ఓరుగల్లు గడ్డపై నిర్వహించనున్న రజతోత్సవాలకు తరలి వెళ్లేందుకు సిద్ధమైంది. వరంగల్ సభను విజయవంతం చేసేందుకు నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల నేతలు నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహించారు. మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి వేల్పూర్‌లో అనుచరులతో సోమవారం సమావేశమయ్యారు. సభ విజయవంతానికి చేపట్టాల్సిన ఏర్పాట్లపై సమీక్షించారు. బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకల ఏర్పాట్లలో గులాబీ దండు నిమగ్నమైంది. ఓరుగల్లు గడ్డపై నిర్వహించనున్న రజతోత్సవాలకు తరలి వెళ్లేందుకు సిద్ధమైంది. వరంగల్ సభను విజయవంతం చేసేందుకు నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల నేతలు నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహించారు. మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి వేల్పూర్‌లో అనుచరులతో సోమవారం సమావేశమయ్యారు. సభ విజయవంతానికి చేపట్టాల్సిన ఏర్పాట్లపై సమీక్షించారు.

ఆర్మూర్‌లో నిర్వహించిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, కామారెడ్డిలో మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు. ప్రతి గ్రామం నుంచి నేతలు, కార్యకర్తలు భారీగా ఓరుగల్లు సభకు తరలి వచ్చేలా చూడాలని సూచించారు. మరోవైపు, మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా, జీవన్‌రెడ్డి సమక్షంలో నగరానికి చెందిన మైనార్టీ యువకులు భారీగా గులాబీ గూటికి చేరారు. వారందరికీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

ఓరుగల్లుకు దండు కట్టాలి

ఈ నెల 27వ తేదీన వరంగల్ జిల్లాలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పార్టీ నేతలు, కార్యకర్తలు భారీగా తరలి రావాలని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే, మాజీ విప్ గంప గోవర్ధన్ పిలుపునిచ్చారు. సోమవారం కామారెడ్డిలోని తన నివాసంలో పార్టీ ముఖ్య నాయకులతో రజతోత్సవ సభకు సంబంధించి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గంప గోవర్ధన్ మాట్లాడుతూ.. ఓరుగల్లులో నిర్వహించనున్న సభకు కామారెడ్డి నియోజకవర్గం నుంచి 3 వేల మంది కార్యకర్తలు



తరలి రావాలని నిర్ణయించారని, కానీ అంతకంటే ఎక్కువగా వెళ్లి సభను విజయవంతం చేయాలని సూచించారు. ఈ నెల 27న అన్ని గ్రామాల్లో గులాబీ జెండాను ఆవిష్కరించాక వరంగల్‌కు బయల్దేరాలని సూచించారు. చరిత్రలో నిలిచిపోయేలా 1500 ఎకరాల్లో నిర్వహిస్తున్న ఈ సభను విజయవంతం చేయడానికి నియోజకవర్గంలోని ప్రధాన చౌరస్తాల్లో వాల్ పెయింటింగ్, పార్టీ నినాదాలు ముద్రిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి నుంచి ప్రజలను చైతన్యవంతులను చేయడానికి, సభకు తరలిరావడానికి ఇంటింటి ప్రచారం నిర్వహించాలని నాయకులకు సూచించారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున వరంగల్ సభకు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జడ్పీ మాజీ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్‌కుమార్, మాజీ జడ్పీటీసీ రాంరెడ్డి, గంద్ర మధుసూదన్, మాజీ ఎంపీపీలు బాలమణి, పిప్పిరి ఆంజనేయు లు, బీఆర్ఎస్ ముఖ్య నేతలు బలవంత్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, జుకంటి మోహన్‌రెడ్డి, ప్రభాకర్‌యాదవ్, ప్రభాకర్‌రెడ్డి, నల్లవెల్లి అశోక్, గోపిగౌడ్, రవియాదవ్ పాల్గొన్నారు.

## ఎన్ఎస్‌యుఐ చేపట్టిన పలాయన్ రోకో.. నౌకరి దో' ర్యాలీలో పాల్గొన్న రాహుల్

బెగెసరాయ్ (బీహార్) :అమృత్ తెలంగాణ: నేడు కాంగ్రెస్ విద్యార్థి విభాగం (ఎన్ఎస్‌యుఐ) బీహార్‌లోని బెగుసరారులో 'పలాయన్ రోకో.. నౌకరి దో (వలసలు ఆపండి.. ఉద్యోగాలు ఇవ్వండి)' అనే ర్యాలీ చేపట్టింది. ఎన్ఎస్‌యుఐ జాతీయ ఇన్‌ఛార్జ్ కన్హయ్య కుమార్ నేతృత్వంలో జరుగుతున్న ఈ ర్యాలీలో లోక్‌సభ ప్రతిపక్షనేత, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పాల్గొన్నారు. ఈ ర్యాలీ సందర్భంగా పాట్నాలో జరుగుతున్న బహిరంగ సభలో రాహుల్ ప్రసంగించనున్నారు. కాగా, పలాయన్ రోకో.. నౌకరి దో ప్రచారంలో తాను పాల్గొనబోతున్నానని రాహుల్ ఆదివారం సోషల్ మీడియాలో వెల్లడించారు. బీహార్ యువత స్ఫూర్తిని, వారి కష్టాలను



ప్రపంచానికి తెలియజేయడానికే ఈ ప్రచారం ముఖ్య లక్ష్యమని రాహుల్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. బీహార్ ప్రభుత్వం ఆ రాష్ట్ర యువతకు ఉపాధి కల్పించడం లేదు. ఈ అంశాన్నే హైలెట్ చేస్తూ.. కాంగ్రెస్ స్టూడెంట్స్ విభాగం ఎన్ఎస్‌యుఐ ర్యాలీ చేపట్టింది. రాష్ట్రంలో తాండవిస్తున్న నిరుద్యోగాన్ని ఈ ఏడాది చివరలో జరగనున్న ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ హైలెట్ చేయనుంది.

# డోలీ మోతలు తప్పిస్తాం

డుంబ్రిగుడ (అల్లూరి జిల్లా) :అమృత్ తెలంగాణ: డోలీ మోతలు తప్పిస్తామని, దీనిలో భాగంగా గిరిజన ప్రాంతాల్లోని మారుమూల గ్రామాలకు రోడ్లు నిర్మిస్తున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ తెలిపారు. గిరిజన ప్రాంత అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అల్లూరి జిల్లా డుంబ్రిగుడ మండలంలో సోమవారం ఆయన పర్యటించారు. తొలుత పెదపాడు పివిటిజి గ్రామాన్ని సందర్శించారు. థింసా నృత్యంతో గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అక్కడి గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లను పవన్ పంపిణీ చేశారు. గ్రామస్తులతో ముఖాముఖి ద్వారా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తాము పండించిన చిరుధాన్యాలను, అటవీ ఉత్పత్తులను స్టాల్స్‌గా గ్రామస్తులు పెట్టి వాటి గురించి పవన్‌కు వివరించారు. అనంతరం మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను పవన్ సందర్శించారు. అడవితల్లి బాట కార్యక్రమం ద్వారా పిఎం జన్‌మన్, పిఎంజిఎస్‌వై, ఎంజిఎన్‌ఆర్ఇజిఎ, పిఆర్‌ఆర్, టిఎస్‌పి పథకాల కింద రూ.1005 కోట్లతో 1,069 కిలోమీటర్ల మేర ఏజెన్సీలోని మారుమూల గ్రామాల్లో రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ గిరిజన మారుమూల గ్రామాలకు రోడ్లు లేక ఆదివాసీలు ఇబ్బందులు పడుతున్నారని, నేటికీ డోలీ మోతలే కనిపిస్తున్నాయని, ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని రోడ్ల నిర్మాణాలకు ప్రాధాన్యతనిచ్చామని తెలిపారు. పచ్చని అడవి తల్లిని నమ్ముకుంటే బువ్వ పెడుతుందని, అందుకే గిరిజన ప్రాంత అభివృద్ధికి 'అడవితల్లి బాట' కార్యక్రమంతో శ్రీకారం చుట్టామని తెలిపారు. గత వైసిపి పాలనలో కేవలం రూ.99 కోట్లును మాత్రమే రోడ్లకు ఖర్చు పెట్టారని విమర్శించారు. ఏజెన్సీ వ్యాప్తంగా సుమారు 1170 గ్రామాలకు రోడ్లు లేవని, దశలవారీగా వాటికి రోడ్లు నిర్మిస్తామని అన్నారు. అరుకు ప్రాంతంలో టూరిజం బాగా అభివృద్ధి చెందాలని, గిరిజన యువత



పర్యాటకంగా పెట్టుబడులు పెట్టి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. గంజాయికి బానిసలై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హితవు పలికారు.

'ఉపాధి'లో కాఫీ మొక్కల పెంపకం

ఉపాధి హామీ చట్టం ద్వారా లక్ష ఎకరాల్లో కాఫీ పంట సాగుకు కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తానని పవన్ కల్యాణ్ తెలిపారు. తద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. రాష్ట్ర విభజనతో ఎపి తీవ్రంగా నష్టపోయిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, జడ్‌పి చైర్‌పర్సన్ సుభద్ర, జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ పాల్గొన్నారు. పవన్ కల్యాణ్ ఏజెన్సీ పర్యటన నేపథ్యంలో అనంతగిరి మండల కేంద్రంలో సోమవారం జరిగే వారపు సంతను అధికారులు తాత్కాలికంగా రద్దు చేయడంతో గిరిజనులు ఇబ్బందులు పడ్డారు.

## ఆరోగ్య వ్యవస్థను ఐసియుకి పంపిన మోడీ

న్యూఢిల్లీ :అమృత్ తెలంగాణ: నేడు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం. ఈ సందర్భంగా మోడీ హయాంలో ఆరోగ్య వ్యవస్థ క్షీణించిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం ఆరోగ్య వ్యవస్థను ఐసియుకి పంపిందని, దీంతో పౌరులపై వైద్య ఖర్చుల భారం విపరీతంగా పెరిగిపోతుందని ఆయన విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో వీడియోను పోస్టు చేశారు. 'గత ఐదేళ్లలో వైద్య ద్రవ్యోల్బణం విపరీతంగా పెరిగిపోయింది. ప్రతి సంవత్సరం 14 శాతం దేశ వైద్య ద్రవ్యోల్బణం పెరిగి భయంకరమైన స్థాయికి చేరింది. ఈ ఏప్రిల్ నాటికి 900 నిత్యావసర మందుల ధరల పెరిగాయి. ఖరీదైన వైద్యం వల్ల ప్రతి సంవత్సరం 10 కోట్ల మంది భారతీయులు పేదరికంలో కూరుకుపోతున్నారని నీతి అయోగ్ నివేదిక చెబుతోంది. మెడికల్ గ్రేడ్ ఆక్సిజన్‌పై 12 శాతం జిఎస్‌టి, బ్యాండేజీలు, సర్జికల్ వస్తువులపై 12 శాతం జిఎస్‌టి, హాస్పిటల్ వీల్‌ఛైర్స్‌పై 18 శాతం జిఎస్‌టి, ఆసుపత్రుల్లో శానిటరీ నాప్‌కిన్‌లపై 18 శాతం జిఎస్‌టి, గుండె చికిత్సలకు 18 శాతం కేంద్రం జిఎస్‌టి విధిస్తోంది. దీంతో ఆసుపత్రి ఖర్చులు ఈ సంవత్సరంలో 11.3 శాతం పెరిగాయి. యాంజియోప్లాస్టి ఖర్చు రెట్టింపు యింది. ఇక కిడ్నీ మార్పిడి ఖర్చు మూడురెట్లు పెరిగింది. మోడీ ప్రభుత్వం ఆరోగ్య వస్తువులపై పన్నులు విధించడంతో వైద్య ఖర్చులు విపరీతంగా



పెరిగిపోయి సాధారణ ప్రజలపై పెనుభారమవుతుంది.' అని ఖర్గే వీడియో పోస్టులో మోడీ ప్రభుత్వంపై ఫైర్ అయ్యారు. జాతీయ ఆరోగ్య విధానం 2017 ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం జిడిపిలో 2.5 శాతం మేర ఆరోగ్యంపై ఖర్చు చేసింది. అయితే ఇప్పుడు మోడీ ప్రభుత్వం 1.84 శాతం మాత్రమే ఖర్చు చేసిందని ఖర్గే విమర్శించారు. కేంద్ర బడ్జెట్ మొత్తం వ్యయంతో పోలిస్తే గత 5 సంవత్సరాలలో ఆరోగ్యం కోసం కేటాయించిన బడ్జెట్ 42 శాతం మేర తగ్గింది అని ఖర్గే ఆరోపించారు. మోడీ ప్రభుత్వం ఆరోగ్యం కోసం కేటాయించే బడ్జెట్‌లో కోతలు విధిస్తూ.. సాధారణ ప్రజలకు వైద్య ఖర్చుల్ని పెంచుతున్నారని ఖర్గే కామెంట్ చేశారు. మోడీ హయాంలో ఆరోగ్య వ్యవస్థ ఐసియుకి చేరిందని ఆయన తీవ్రంగా విమర్శించారు.

## గుజరాత్‌కు రెడ్ అలర్ట్ : ఐఎండి

న్యూఢిల్లీ :అమృత్ తెలంగాణ: గుజరాత్‌లో ఎండలు మండిపోతున్నాయి. దీంతో సోమవారం భారత వాతావరణ శాఖ (ఐఎండి) రెడ్ అలర్ట్‌ను జారీ చేసింది. ఆదివారం గుజరాత్‌లో సౌరాష్ట్ర, కచ్ ప్రాంతాల్లో 44 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలోనే ఆ రాష్ట్రానికి ఐఎండి రెడ్ అలర్ట్ ప్రకటించింది. ఇక దేశ రాజధాని ఢిల్లీలో రాబోయే రెండు రోజుల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండి అంచనా వేసింది. దీంతో ఢిల్లీకి నేడు ఐఎండి ఎల్లో అలర్ట్ ప్రకటించింది.కాగా, హిమాచల్ ప్రదేశ్, హర్యానా, చండీగఢ్, పంజాబ్, ఢిల్లీ పశ్చిమ ఉత్తరప్రదేశ్, మధ్యప్రపదేశ్, గుజరాత్, గోవా రాష్ట్రాల్లో రాబోయే రెండు రోజులు ఏప్రిల్ 8–9 తేదీల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండి అంచనా వేసింది. అలాగే ఢిల్లీ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, ఒడిశా రాష్ట్రాల్లోని 21 నగరాల్లో 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండి తెలిపింది.

## ఆదిలాబాద్ పట్టణం లిటిల్ ఫ్లవర్ హౌసింగ్ బోర్డ్ లోని సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో సీబీఎస్ఈ కోసం నూతన భవనం



భూమి పూజ చేస్తున్న దృశ్యం

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీసరస్వతి విద్యాపీఠం ప్రాంత సంఘటన మంత్రి పతకమూరి శ్రీనివాస్, ఎంపీ నగేష్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాజీ తాజా,వార్డ్ కౌన్సిలర్ అంబకంటి అశోక్ హాజరయ్యారు. ముందుగా వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ భూమి పూజ చేశారు. సంస్కరంతో పాటు దేశభక్తిపై విద్యార్థులకు విలువలను తెలియజేస్తు కాలనుగుణంగా సరస్వతి శిశుమందిరాల్లో కూడా సీబీఎస్ సెలబస్ ను ప్రారంభించనున్నట్టు శ్రీసరస్వతి విద్యాపీఠం ప్రాంత సంఘటన మంత్రి పతకమూరి శ్రీనివాస్ తెలిపారు.

## ప్రధాని మోడీకి ధన్యవాదములు ఎంపీ నగేష్ శాసనసభ్యులు పాయల్ శంకర్




మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ నగేష్ శాసనసభ్యులు పాయల్ శంకర్

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ప్రధాని మోడీకి ధన్యవాదములు ఎంపీ నగేష్ శాసనసభ్యులు పాయల్ శంకర్ ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ అదిలాబాద్ ఎయిర్ ఫోర్స్, తోపాటు విమానాశ్రయం ఏర్పాటు కోసం గత పదిలుగా చేసిన పోరాటం వల్లే సాధ్యపడింది అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రానికి సహకరించడం శుభ పరిణామం అని చెప్పారు. త్వరలోనే భూసేకరణ మౌలిక వస్తువుల ఏర్పాటు జరుగుతుందని నరేంద్ర మోడీ ప్రత్యేకంగా అదిలాబాద్ జిల్లాపై దృష్టి సారించి అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే జిల్లాకు రావలసిన కేంద్ర ప్రాజెక్టులు రాలేదని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. సోమవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. బీజేపి ఎంపీ, ఎమ్మెల్యే గెలిస్తే ఏమవుతుందని అన్న నాయకులకు ఎయిర్ ఫోర్స్, ఎయిర్ షిఫ్ట్ సమాధానం అని తెలిపారు. జిల్లా ప్రజల కల ఎయిర్ పోర్టు మంజూరు చేసినందుకు ప్రధాని మోదీతో పాటు కేంద్ర మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు . కార్యక్రమంలో బిజెపి నాయకులు రాజు. లాలా మున్నా మయూర్ చంద్ర నగేష్. జోగు రవి వేద వ్యాస్ దినేష్ మాటోలియా. కృష్ణ యాదవ్ . రత్నాకర్ రెడ్డి. శ్రీనివాస్ సుభాష్. రాకేష్ భూమేష్ తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్య చికిత్సలను అందించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ వైద్యాధికారులను ఆదేశించారు.



అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ సోమవారం స్థానిక ప్రభుత్వ మాత, శిశు సంరక్షణ ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ఎస్ఎన్ సియు, పోస్ట్ ఆపరేషన్, ఇంజక్షన్ వార్డులను పరిశీలించి రిజిస్టర్ లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రికి వచ్చే గర్భిణీలు, బాలింతలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన వైద్య చికిత్సలు, సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. సాధారణ ప్రసవాలను సంఖ్యను పెంచాలని, ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం కలిగేలా మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని, విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి, నిరంతరం పరిశుభ్రతను పాటించాలన్నారు. పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, అవుట్ పోస్ట్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, సౌకర్యాలపై రోగులను కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో ఆసుపత్రి వైద్యులు డా. సరోజ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఆపన్నహస్తం అందించండి..



మంచిర్యాల (ఏసీసీ), ఏప్రిల్ 7:అమృత్ తెలంగాణ: పేద కుటుంబానికి పెద్ద కష్టం వచ్చింది. అల్లారుముద్దుగా పెంచుకున్న కొడుకు బ్లడ్ క్యాన్సర్ బారిన పడడంతో అల్లాడుతున్నది. ప్రాణాంతక రోగానికి చికిత్స చేయించేందుకు లక్షల్లో ఖర్చవుతుందని తెలిసి ఆందోళన చెందుతున్నది. అయినా కొడుకును బతికించుకునేందుకు దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నది. వివరాల్లోకి వెళితే.. మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన సయ్యద్ అలీ.. స్థానికి ఆర్డీవో ఆఫీసులో హోంగార్డుగా పని చేస్తున్నాడు.

ఇద్దరు కొడుకులు కాగా, పెద్ద కొడుకు కరీం (21) గతేడాది చదువు నిమిత్తం హైదరాబాద్ వెళ్లాడు. అనారోగ్యంతో పాటు తరచూ జ్వరం వస్తుండడంతో మంచిర్యాలకు తీసుకువచ్చి, స్థానికంగా చూపించారు. ఎంతకీ జ్వరం తగ్గకపోవడంతోపాటు ప్లేట్ లెట్లు తగ్గిపోవడంతో వైద్యుల సలహాపై పరీక్షలు చేశారు. బ్లడ్ క్యాన్సర్ అని తేలింది. ప్రస్తుతం చికిత్స కోసం హైదరాబాద్‌లోని బసవతారకం దవాఖానలో చికిత్స తీసుకుంటున్నాడు. కాగా, చికిత్సకు రూ.15 లక్షలపైగా అవసరమవుతుందని తెలియడంతో ఆ కుటుంబం ఆందోళన చెందుతున్న ది. కనీసం సొంత ఇల్లు కూడా లేని తమకు, కొడుకు ను ఎలా బతికించుకోవాలో తెలియని సందిగ్ధంలో పడిపోయింది. ఇప్పటికే శక్తికి మించి అప్పు చేసి, రో జూ చికిత్స చేయిస్తున్న ఆ కుటుంబం దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నది. తోచిన సాయం చేయాలని వేడుకుంటున్నది. అందుకు 98660 34012, 93812 15299 నంబర్లకు ఫోన్ పే, గూగుల్ పే ద్వారా సాయం అందించాలని కోరుతున్నది.

## సోనాలలో జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమం ప్రారంభించిన సోనాల మండల కాంగ్రెస్ నాయకులు




అమృత్ తెలంగాణ న్యూస్ : తెలంగాణ కాంగ్రెస్ కమిటీ ఇన్చార్జ్ వర్యులు మీనాక్షి నటరాజన్ ఆదేశాల మేరకు సోనాల మండల కేంద్రంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అదేవిధంగా బహుజన్ సామ్రాట్ శివాజీ గారి విగ్రహాలకు పూలమాలలు వేసి పాదయాత్ర ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ దేశంలో బిజెపి ఆర్ఎస్ఎస్ హింస సిద్ధాంతాలతో దేశాన్ని అధోగతి వైపు మళ్లిస్తూ రాజ్యాంగాన్ని అహింస వాదాన్ని అంబేద్కర్ ఇజన్ని పక్కన పెట్టి మతం కులం పేరుతో విభజించు పాలించు అన్న సిద్ధాంతంతో దేశాన్ని రావణ కాష్టన్గా మారుస్తూ భారతదేశాన్ని హింసవాదంగా మారుస్తూ దేశాన్ని సర్వనాశనం చేస్తున్నారని దేశం అభివృద్ధి చెందాలంటే అహింస వాదంతో రాజ్యాంగన్ని అనుసరించి ముందుకు వెళ్లాలని సూచించారు అందులో భాగంగానే సోనాల మండల కేంద్రంలో ప్రతి ఊరు ప్రతి వాడ బాపు అంబేద్కర్ రాజ్యాంగం ఫోటోలతో ముందుకు వెళ్లి దేశం సస్యశ్యామలంగా ఉండాలని ఉద్దేశంతో ముందుకు వెళ్తున్నామని తెలియజేశారు.

ఇట్టి కార్యక్రమంలో సోనాల పట్టణ అధ్యక్షులు చెట్ల పెల్లి అనిల్, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ రమేష్ బత్తుల, సీనియర్ నాయకులు, గాజుల పోతన్న,, రామయ్ రాము, పోశెట్టి, అమృత్ రావ్, ఇశ్రు పటేల్, జాకెష్, నరేందర్, బలిరామ్, అంకుష్, సత్యనారాయణ, శ్రీనివాస్, బాలాజీ, బందు, సాగర్, మాధవ్ రావ్ పటేల్, అంకుస్, లక్ష్మణ్ , శ్రీధర్ ముండే, తులసిరం తదితరులు పాల్గొన్నారు

## ప్రజావాణి లో భాగంగా సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అర్జీదారుల నుండి అర్జీలను స్వీకరించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా.



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ సోమవారం నిర్వహించే ప్రజావాణి లో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజాఫిర్యాదులలో భాగంగా వివిధ మండలాల నుండి వచ్చిన దరఖాస్తుదారుల నుండి దరఖాస్తులను జిల్లా కలెక్టర్ రాజర్షి షా అదనపు కలెక్టర్ శ్యామలాదేవి తో కలసి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా 111 దరఖాస్తులను స్వీకరించడం జరిగిందనీ అన్నారు. గతంలో ఎలుగుబంటి దాడిలో గాయపడిన తలమడుగు మండలం లోని వ్యక్తికి 5 లక్షల రూపాయల చెక్కును జిల్లా కలెక్టర్ రాజర్షి షా గ్రీవెన్స్ లో అందజేశారు. వివిధ శాఖలకు సంబంధించి విద్యా, వైద్యం, మున్సిపల్, ed sc కార్పోరేషన్, విద్యుత్తు, పంచాయితి, రెవెన్యు, మహిళా శిశు సంక్షేమ శాఖ, తదితర శాఖల నుండి దరఖాస్తులను స్వీకరించి సంబంధిత అధికారులకు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ గ్రీవెన్స్ లో జిల్లా అధికారులు, రెవెన్యు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారిణి అదిలాబాద్ గారి చే జారీ చేయనైనది.

## కత్తిని చూపిస్తూ చంపేస్తానంటూ బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు. నిందితుడు అరెస్ట్.




అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ప్రజలను భయభ్రాంతులకు గురి చేసేలా ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవు. Cr.no 153/2025 u/sec 296(ఎ), 351BNS తో కేసు నమోదు. ఆదిలాబాద్ ఒకటో పట్టణ సిఐ బి సునీల్ కుమార్. రామ నవమి సందర్భంగా ఆదిలాబాద్ పట్టణంలో నిర్వహించిన భారీ ర్యాలీ లో ఆదిలాబాద్ ర్యాలీ లో చించేరివాడ సంబంధించిన వ్యక్తి తోట విగ్నేష్ s/o గంగాధర్, కత్తిని చూపిస్తూ చంపేస్తానంటూ బెదిరించి నందున ఆదిలాబాద్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేయడం జరిగిందని పట్టణ సీఐ బి సునీల్ కుమార్ తెలిపారు. కత్తులను చూపిస్తూ బెదిరించి చంపేస్తామంటూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేసేలా ఎలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిన్న శ్రీరామనవమి సందర్భంగా పట్టణంలో ఏర్పాటు చేసిన భారీ ర్యాలీలో నిందితుడు కత్తితో తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేశాడని అతనిపై ఆదిలాబాద్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్లో Cr.no 153/2025 u/sec 296(ఎ), 351BNS తో కేసు నమోదు చేసి అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు. ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రజలు ముఖ్యంగా యువకులు సంఘ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడకుండా ఉండాలని సూచించారు.

## ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.



ప్రజల నుంచి దరఖాస్తు లు తీసుకుంటున్న జిల్లా పాలన అధికారి అభిలాష అభినవ్



హాజరైన అధికారులు

అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పింఛన్లు, ధరణి, భూ సమస్యలు, డబుల్ బెడ్ రూమ్, రైతు రుణమాఫీ వంటి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు తమ అర్జీలను సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. శాఖల వారీగా ఇప్పటివరకు పెండింగ్ లో ఉన్న దరఖాస్తులు, సీఎం ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారులకు పరిష్కారానికి సంబంధించిన వివరాలను అందజేయాలన్నారు. మండల ప్రత్యేక అధికారులంతా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటించి గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను అందజేయాలన్నారు. నూతన పథకాలు అమలు, ఇందిరమ్మ ఇండ్ల మార్కింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించి ఎంపీడీవో కార్యాలయాలలో ఆఫ్ లైన్ విధానంలోనూ దరఖాస్తులను స్వీకరించాలని, దరఖాస్తుదారులకు రసీదును ఇవ్వాలన్నారు. స్వయం ఉపాధికై రాజీవ్ యువ వికాసం పథకానికి అధిక సంఖ్యలో దరఖాస్తులు వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన సన్నబియ్యం పంపిణీ పథకానికి సంబంధించి ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవాలన్నారు. వేసవిలో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

టెలిఫోన్ ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా అర్జీలను స్వీకరించిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.

అధిక ఉష్ణోగ్రతల కారణంగా, జిల్లాలోని మారుమూల ప్రాంతాల ప్రజల సహాయార్థం టెలిఫోన్ ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10:30 నుంచి 11:00 గంటల వరకు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ప్రజల అర్జీలను ఫోన్ ద్వారా స్వీకరించారు. ప్రజల సమస్యలను విని, సంబంధిత అధికారులకు ఆయా సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. కాగా సోమవారం టెలిఫోన్ ప్రజావాణి ద్వారా 10 మంది దరఖాస్తుదారులు తమ అర్జీలను సమర్పించారు. దరఖాస్తు వివరాలను వాట్సప్ ద్వారా స్వీకరించి. ప్రజావాణిలో సమస్య నమోదుకు సంబంధించి రసీదును సంబంధిత వ్యక్తులకు వాట్సప్ ద్వారా అందించారు. ఈ ప్రజావాణిలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డిఓ రత్నకళ్యాణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగ చిన్నారులు ఫిజియోథెరపీ సేవలు వినియోగించుకోవాలి : ఎంఈఓ రామారావు



మధిర (చింతకాని ), ఏప్రిల్ 07:అమృత్ తెలంగాణ: దివ్యాంగ చిన్నారులకు ప్రతి బుధవారం నిర్వహించే ఫిజియోథెరపీ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఖమ్మం జిల్లా చింతకాని మండల విద్యాశాఖ అధికారి సలాది రామారావు అన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో దివ్యాంగుల పిల్లల తల్లిదండ్రులకు ఫిజియోథెరపీ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చింతకాని మండల పరిధిలోని లచ్చగూడెం హై స్కూల్ ప్రాంగణంలో దివ్యాంగ బాలబాలికల భవితా కేంద్రం సేవలందిస్తుందన్నారు. 19 ఏళ్ల లోపు వయసు గల శరీరక వైకల్యం కలిగిన వారికి ఈ సేవలు అందించడం జరుగుతుందన్నారు. పుట్టుకతో వచ్చే పాక్షిక పక్షవాతం, శరీరంలోని కండరాల మధ్య సమన్వయ లోపంతో బాధపడుతూ కూర్చోడంలోనూ, నిలబడడం, అడుగులు వేయడం, నడవడంలోనూ ఇబ్బంది పడే చిన్నారులకు ఈ కేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. మరిన్ని వివరాల కోసం ఆర్పీలు కే.ఎస్. కృష్ణారావు 6302504078, 9492244874, భూక్య దస్లి 9701611706, ఫిజియోథెరపీ వైద్య నిపుణురాలు డాక్టర్ జి.వసంత 9618608929 ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

# దాహం తీరేదెట్లా!







తిర్యాణి, ఏప్రిల్ 7:అమృత్ తెలంగాణ: ఎండాకాలం వచ్చిందంటే చాలు ఆ మారుమూల గ్రామాల గిరిజనం తాగు నీటికి తండ్లాడుతున్నది. కొన్నిచోట్ల బోర్‌వెల్‌లు పాడైపోగా, మరికొన్ని చోట్ల బావులు అడుగంటి అష్టకష్టాలు పడుతున్నది. గుక్కెడు నీటికోసం పనులన్నీ వదులుకొని.. నిద్రాహారాలు మాని వాగులు.. వంకల వెంట పరుగులు తీయాల్సిన దుస్థితి నెలకొన్నది.

పనిచేయని బోర్‌వెల్‌లు.. అడుగంటిని బావులు..

తిర్యాణి మండలం గుండాల, మంగీ, తొక్కిగూడ, తాటిగూడ, గోపెర, లంబాడీతండా, గోవెన, కొలాంగూడ, కుర్సుగూడ, భీంరాళ్ల, బందర్‌గూడ, మొర్రిగూడ, లోహ, తోయరేటి, మగర్‌మోడీ, దోంగుర్‌గాం, బోర్ధం తదితర గ్రామాల్లో తాగు నీటి కష్టాలు మొదలయ్యాయి. పలుచోట్ల బోరుబావులు పాడైపోగా.. మరికొన్ని చోట్ల చేదబావుల్లో నీరు మొత్తం ఇంకిపోయింది. ఇక మిషన్ భగీరథ పథకం ఉ న్నప్పటికీ నిర్వహణ లేక.. పైపులైన్‌లకు మరమ్మతులు చేయక తాగు నీరు సరఫరా కావడం లేదు. దీంతో ఇంటి అవసరాలకు తాగు నీటికి గిరిజనులు అవస్థలు పడుతున్నారు.

కొందరు ఎడ్లబండ్లు కొట్టుకొని స్థానిక వాగుల్లో చెలిమెలు తోడుకొని నీరు తెచ్చుకుంటుండగా, మరికొందరు కిలోమీటర్ల కొద్ది కాలినడకన వెళ్లి బిందెల్లో నీరు మోసుకొస్తున్నారు. పనులన్నీ వదులుకొని చిన్నా పెద్దా తేడా లేకుండా నీటికోసం వేట సాగించాల్సి వస్తున్నది. ప్రస్తుతం ఎండలు కూడా ముదరడంతో వాగుల్లో ఊట తగ్గి ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

చెలిమెలు తోడుకొని ఊట వచ్చేదాకా ఎదురుచూడాల్సి వస్తున్నది. తప్పనిసరి పరిస్థితుల్లో మురుగు నీటిని కూడా తాగాల్సి వస్తున్నదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక మూగజీవాలకు సైతం తాగు నీటికి అల్లాడుతున్నాయని వాపోతున్నారు.

తమ ఇబ్బందులను అధికారులు పట్టించుకున్న పాపాన పో వడం లేదని, ఇకనైనా స్పందించి త మ గోస తీర్చాలని వేడుకుంటున్నారు.

నాలుగైదు కిలోమీటర్లు నడుస్తున్నం

మా ఊరోళ్లంతా తాగు నీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నరు. మా ఊరిలో బోర్‌వెల్ లేదు. పక్కనున్న నాయకపుగూడలో ఒకే ఒక్క బావి ఉంది. అక్కడికి వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నం. గోండుగూడ, కొలాంగూడ గ్రామస్తులు కూడా అక్కడికే వస్తుండడంతో తాగు నీరు సరిపోవడం లేదు. దీంతో నాలుగైదు కిలో మీటర్ల దూరంలోని వాగుకు వెళ్లి చెలిమెలు తోడుకొని నీరు తెచ్చుకోవాల్సి వస్తున్నది.

పనులన్నీ వదులుకొని.. తిండీ తిప్పలు.. నిద్రాహారాలు మాని తాగు నీటి కోసం తండ్లాడుతున్నాం. ఇప్పుడు ఎండలు కూడా ముదిరినయి. ఇంకొన్ని రోజులు పోతే ఆ చెలిమెల నీరు కూడా దొరికేలా లేవు. ఇగ మేమంతా ఎట్లా బతకడం. ఇకనైనా అధికారులు స్పందించి తాగు నీటి గోస తీర్చాలి.

కుడిమెత మారుబాయి. మొర్రిగూడ

లేవంగనే నీళ్లకు పోతున్నం

మా ఊరికి ఏడెనిమిది కిలో మీటర్ల దూరంలో వాగు ఉంది. లేవంగనే అక్కడికి పోయి చెలిమెల నీళ్లు తెచ్చుకుంటున్నం. పొద్దుగాల పోతనే నీళ్లు దొరుకుతయి. లేదంటే చెలిమెలో ఊట వచ్చేదాక ఆగాలి.

రెండు మూడు గంటలు పడుతది. ఎడ్లబండ్లు లేనోళ్లు నెత్తిమోపుల ద్వారా నీళ్లు తెచ్చుకుంటున్నరు. మా ఊర్లో ఉన్న బావి ఎండిపోయింది. మిషన్ భగీరథ ద్వారా కొన్ని రోజులు నీళ్లిచ్చిన్రు. ఇప్పుడు పైపులైన్‌లను బాగు చేసేటోళ్లు లేక నీళ్లస్తలేవు. ఎవరైనా వస్తే అన్నం పెట్టే పరిస్థితి ఉంది కానీ.. నీళ్లివ్వలేము. ఇకనైనా అధికారులు మాకు తాగు నీరందించాలి.

# సీజన్‌కు ముందే నకిలీ దందా



కుమ్రం భీం ఆసిఫాబాద్, ఏప్రిల్ 7అమృత్ తెలంగాణ: : సీజన్‌కంటే ముందే పల్లెల్లో నకిలీ విత్తనాల దందా మొదలైంది. మూడు రోజుల క్రితం చింతలమానేపల్లిలో రూ.10.50 లక్షల విలువ చేసే 3 క్వింటాళ్లు పట్టుబడడం ఇందుకు బలం చేకూరుస్తున్నది. వానకాలం ప్రారంభం కావడానికి రెండు నెలల ముందు నుంచే అక్రమ వ్యాపారం ప్రారంభించడం ఆందోళన కలిగిస్తున్నది.

పేరు.. ఊరు లేని కంపెనీల్లో తయారైన విత్తనాల ప్యాకెట్లను అమాయక రైతులకు అంటగట్టేందుకు వ్యాపారులు రంగంలోకి దిగినట్లు తెలుస్తున్నది. విత్తనాల సంచులపై తయారు చేసిన తేదీ.. వ్యాలిడిటీ తదితర వివరాలేవీ ఉండడం లేదు. లైసెన్స్‌లు పొందిన దుకాణాదారులే వాటిని తెప్పించి గుట్టు చప్పుడు కాకుండా పల్లెల్లోకి చేరవేస్తున్నట్లు సమాచారమున్నది.

ఏపీ, మహారాష్ట్ర నుంచి..

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోకి ఏపీ, మహారాష్ట్రలోని పలు జిల్లాల నుంచి వివిధ మార్గాల ద్వారా నకిలీ విత్తనాలు వస్తున్నాయి. జిల్లాలో ఎరువులు, విత్తనాలు అమ్మేందుకు లైసెన్స్‌లు పొందిన డీలర్లు 251 మంది ఉన్నారు. వీరం తా తమ దుకాణాల ద్వారా విత్తనాలు, ఎరువులు అమ్ముతున్నారు. నకిలీ విత్తనాలను లైసెన్స్ పొందిన వారే తెప్పిస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో అధికారులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఫర్టిలైజర్స్‌ను తనిఖీ చేస్తున్నారు. నిషేధిత విత్తనాలు, ట్యాగ్లెసిల్‌లను అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నారు.

మోసపోతున్న రైతులు

నకిలీ విత్తనాలు గుర్తించేలా ఉండకపోవడంతో రైతులు వాటిని కొనుగోలు చేసి మోసపోతున్నారు. సాధారణంగా బ్రాండెడ్ కంపెనీలు విక్రయించే విత్తనాలు, మందులపై వాటిని తయారు చేసిన తేదీ, ఎక్స్‌పైరీ తేదీ, లాట్ నంబర్లు తదితర వివరాలు ఉంటాయి. బ్రాండెడ్ కంపెనీలు తయారు చేసినట్లుగా నకిలీ విత్తనాల కంపెనీలు కూడా అదేస్థాయిలో ప్యాకెట్లను ముద్రించి మార్కెట్‌లోకి సరఫరా చేస్తున్నారు.

కానీ, వీటిపై విత్తనాలు తయారు చేసిన తేదీ.. ఎక్స్‌పైరీ తేదీ.. లాట్ నంబర్ వంటి వివరాలు ఉండవు. ఏదో ఒక పేరుతో ప్యాకెట్లను తయారు చేసి సరఫరా చేస్తుంటారు.

నకిలీలపై నిఘా..

వివిధ రకాల కంపెనీల పేర్లతో నకిలీ విత్తనాలను అమాయక రైతులకు అంటగడుతున్న ముఠాలను అరికట్టే దిశగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. జిల్లాలో యేటా యథేచ్ఛగా కొనసాగుతున్న నకిలీ విత్తనాల దందా గుట్టు రట్టు చేసేందుకు సిద్ధమవుతున్నారు.. ముఖ్యంగా జిల్లాలో లైసెన్స్ పొందిన డీలర్ల అండదండలతోనే నకిలీ విత్తనాల దందా జోరుగా సాగుతుందనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో టాస్క్‌ఫోర్స్ అధికారులు నకిలీ విత్తనాల సరఫరాపై నిఘా పెంచారు. ఆసిఫాబాద్ జిల్లాకు పొరుగున్న ఉన్న రాష్ట్రాల నుంచి సరఫరా అయ్యే నకిలీ విత్తనాలపై ప్రత్యేక బృందాల ద్వారా దృష్టి పెడుతున్నారు.

# పౌర సేవలో శివారెడ్డిగూడెం ముందంజ

భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 7 :అమృత్ తెలంగాణ: మండలంలోని శివారెడ్డిగూడెం గ్రామపంచాయతీ ఆన్‌లైన్‌లో పౌర సేవలు అందించడంలో రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచింది. ఎటుచూసినా పచ్చదనం పరవళ్లు తొక్కుతూ, వ్యవసాయం, అనుబంధ ఆధారిత ప్రాంతమైన ఈ గ్రామంలో 580 కుటుంబాలు ఉన్నాయి. 2,063 మంది జనాభా ఉన్నారు. అన్ని వర్గాల ప్రజలతో అనుబంధాలతో మెలుగుతున్న శివారెడ్డిగూడెం గ్రామపంచాయతీ అన్ని పౌర సేవలను ఆన్‌లైన్ ద్వారా అందించడంతో జిల్లాలో ఆదర్శంగా నిలిచింది. కేంద్ర ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఆఫ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ అండ్ పబ్లిక్ గ్రీవెన్స్ (పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల అమలు) డీఏఆర్ పీజీలో ఉత్తమ ర్యాంక్ సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. శివారెడ్డిగూడెం గ్రామపంచాయతీ ఆన్‌లైన్ ద్వారా పౌర సేవలు అందించడంతో పౌర సేవల అమలు తీరును పరిశీలించేందుకు త్వరలో ఉన్నతాధికారుల బృందం గ్రామపంచాయతీని సందర్శించనున్నది.

గ్రామ విశిష్టత

శివారెడ్డిగూడెం గ్రామంలో 80శాతం మంది అక్షరాస్యులు ఉన్నారు. కంప్యూటర్, డిజిటల్ పేమెంట్స్ సేవలు చెల్లించడంలో యువత ఆసక్తి చూపుతుంది. గ్రామంలో విరివిగా ట్రాక్టర్లు, వరి కోత యంత్రాలు, రసాయన ఎరువులు వెదజల్లె డ్రోన్లతో యువత ఉపాధి పొందుతున్నారు. గ్రామపంచాయతీ ట్రాక్టర్ ద్వారా ప్రతి ఇంటికీ వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరిస్తున్నారు.

చెత్తతో కంపోస్ట్ ఎరువు తయారు చేస్తున్నారు. గ్రామంలో నర్సరీ ఏర్పాటు చేసి ఖాళీ ప్రదేశాల్లో, రోడ్ల వెంట విరివిగా మొకలు నాటారు. వీధులను పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజలకు సురక్షితమైన మంచినీటిని అందిస్తున్నారు. ఆరోగ్య ఉప కేంద్రంలో రోగులకు వైద్య చికిత్స అందించడం గమనార్హం. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించి గ్రామపంచాయతీలో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

ఆన్‌లైన్ ద్వారా అన్ని సేవలు

రాష్ట్ర రాజధానికి 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న శివారెడ్డిగూడెం గ్రామపంచాయతీలో జననం, మరణ ధ్రువీకరణ పత్రాలు, భవన నిర్మాణ అనుమతులు, వివాహ సర్టిఫికెట్లు, వృత్తి, వ్యాపార లైసెన్సుల జారీ, ట్యాక్స్, నాన్ ట్యాక్స్ చెల్లింపులు, మ్యుటేషన్ సేవలు ఆన్‌లైన్‌లో అందిస్తున్నారు.

ఉపాధి హామీ కూలీలకు జాబ్ కార్డుల జారీ, వేతనాల చెల్లింపులు, మస్టర్ నమోదు, తాగునీరు, శానిటేషన్, ఫిర్యాదులు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ, గ్రామసభలో చర్చించే ఎజెండా అంశాలు, సంక్షేమ పథకాల అమలు, నిర్ణయ్ యాప్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేస్తారు. గ్రామాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సలహాలను 'మేరి' యాప్‌లో స్వీకరిస్తారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 100 శాతం ఆస్తి పన్ను వసూలైన గ్రామపంచాయతీగా శివరెడ్డిగూడెం రికార్డుకెకింది. గడువు కంటే ముందుగానే గ్రామస్తులు పన్నులు



చెల్లించారు.

ధాన్యం ఉత్పత్తిలో అగ్రస్థానం

ధాన్యం ఉత్పత్తిలో శివారెడ్డిగూడెం పది సంవత్సరాల నుంచి జిల్లాలోనే అగ్రస్థానంలో నిలిచింది. 2023లో ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ అవార్డు దకించుకుంది. మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో ఏ సమస్య రాకుండా విజయవంతంగా నిర్వహించినందుకు జిల్లా ఉత్తమ అవార్డుకు ఎంపికైంది. దాంతోపాటు పలు అవార్డులు దకాయి.

జాతీయ స్థాయికి ఎంపికవుతాం

గ్రామపంచాయతీలో ఆన్‌లైన్ ద్వారా పౌర సేవలు అందించడంపై శివారెడ్డిగూడెం గ్రామపంచాయతీ ర్యాంకింగ్‌లో అగ్రస్థానంలో నిలువడంతో రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. అధికారుల పరిశీలన, స్క్రూట్నీ తర్వాత జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు. ఆన్‌లైన్ సేవలను వీడియోగ్రఫీ కూడా చేశాం. చాలా బాగుంది. జాతీయ స్థాయికి వెళ్తామని నమ్మకం నాకుంది.

గూడూరు రజిత, పంచాయతీ కార్యదర్శి, శివారెడ్డిగూడెం

రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచింది

ఆన్‌లైన్ ద్వారా పౌర సేవలు అందించడంలో శివారెడ్డిగూడెం గ్రామపంచాయతీ రాష్ట్రస్థాయిలో ఆదర్శంగా నిలిచింది. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, వివాహ సర్టిఫికెట్లు, లైసెన్సులు, భవన నిర్మాణ అనుమతులు, పన్నుల చెల్లింపు ఆన్‌లైన్ ద్వారా చేస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రజలకు చేరువలో సత్వర సేవలు అందిస్తున్నారు. గ్రామంలో పచ్చదనం, పరిశుభ్రతతోపాటు సేంద్రియ ఎరువులు వినియోగిస్తున్నారు. పచ్చని పైర్లతో గ్రామం కళకళలాడుతుంది.

రాపర్తి భాసర్‌గౌడ్, ఎంపీడీఓ, భూదాన్ పోచంపల్లి మండలం

# కమనీయం.. రాములోరి కల్యాణం



అమృత్ తెలంగాణ:కమనీయం.. రాములోరి కల్యాణం జిల్లాలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. హనుమాన్, రామాలయాల్లో వేదపండితులు శ్రీ సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా జరిపించారు. ముందుగా ఉత్సవ విగ్రహాలను హనుమాన్ దీక్షాపరులు, భక్తులు శోభాయాత్రగా ఆలయాలకు తీసుకువచ్చారు.

జిల్లాలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. హనుమాన్, రామాలయాల్లో వేదపండితులు శ్రీ సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా జరిపించారు. ముందుగా ఉత్సవ విగ్రహాలను హనుమాన్ దీక్షాపరులు, భక్తులు శోభాయాత్రగా ఆలయాలకు తీసుకువచ్చారు. ఆయా చోట్ల ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. స్వామివార్లకు పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. అనంతరం ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

పాత మంచిర్యాలలోని శ్రీ రామాలయ దేవస్థానంలో మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, రాజకుమారి దంపతులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నడిపిల్లి విజిత్ రావు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విశ్వనాథ ఆలయంలో నిర్వహించిన కల్యాణంలో పాల్గొన్నారు. సాయికుంట వేంకటేశ్వర స్వామి ఆలయంలో కమిటీ అధ్యక్షుడు తాటిపల్లి అశోక్ దంపతులు, మున్సిపల్ మా జీ కౌన్సిలర్ సుధమల్ల హరికృష్ణ గాయత్రి దంపతులు, అలాగే హమాలీవాడ హనుమాన్ ఆలయంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నల్ల శంకర్ పాల్గొన్నారు.

శ్రీరాంపూర్ కాలనీ భక్తాంజనేయాలయంలో జరిగిన వేడుకల్లో మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఈసంపెల్లి ప్రభాకర్, మాజీ సర్పంచ్ మల్లెత్తుల రాజేంద్రపాణి, ఆలయ కమిటీ అధ్యక్షుడు తోట సురేశ్, టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కే సురేందర్‌రెడ్డి, ఆర్కే 6 గుడిసెలు కొత్తరోడ్ ఆంజనేయాలయంలో ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు పూజలు చేశారు. ఆయా చోట్ల కమిటీ అధ్యక్షుడు మారుతి, మాజీ కౌన్సిలర్లు పం బాల గంగాఎర్రయ్య, బెడిక లక్ష్మి పాల్గొన్నారు.

నస్పూర్ కాలనీ షిర్కే వెంకటేశ్వరాలయంలో సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్) ఎల్వీ సూర్యనారాయణ-మాలతి, జీఎం ఎం శ్రీనివాస్-ఉమారాణి, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రా వు, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ దంపతులు పాలొన్నారు. అలాగే నస్పూర్ కాలనీ ఆంజనేయాలయంలో ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఈసంపెల్లి ప్రభాక్, టీబీజీకేఎస్ ప్రధాన క్యాదర్శి సురేందర్‌రెడ్డి, నస్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ సుర్మిల్ల వేణు పూజలు చేశారు.

హాజీపూర్ మండలం ముల్కల్ల, వేంపల్లిలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్ కుమార్ పూజలు చేశారు. దండేపల్లి మండలం వెల్గనూర్ రామాలయ దేవస్థానం ప్రారంభోత్సవంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్ రావు పాల్గొన్నారు. ఆయనను ఆలయ కమిటీ ఘనంగా సన్మానించింది. ఆలయానికి రూ.25వేలు విరాళంగా అందచేశారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని జనకాపూర్ కోదండ రామాలయం ఆవరణలో సీతారాములకు ఎమ్మెల్యే కోవ లక్ష్మి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు.

సాయంత్రం ఉత్సవ విగ్రహాలతో శోభాయాత్ర నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు, సినీ దర్శక నిర్మాత దండ నాయకుల సురేశ్ కుమార్, మాజీ ఎంపీపీలు మల్లికార్జున యాదవ్, బాలే ష్ గౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్ మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు. కాసిపేట మండలం దేవాపూర్ హనుమాన్, అయ్యప్ప, సల్పాలవాగులోని రామాలయంలో బెల్లంపల్లి మాజీ ఎ మ్మెల్యే దుర్గం చిన్నయ్య హాజరయ్యారు. స్వ యంగా భక్తులకు మంచినీరు పోసి, భోజనం వడ్డించారు.

బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బొ ల్లు రమణారెడ్డి, గొంది వెంకటరమణ, మాజీ జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, మాజీ ఎంపీటీసీ కొండబత్తుల రాంచందర్, మాజీ ఉప సర్పంచ్ బోయిని తిరుపతి, సీనియర్ నాయకులు వాసుదేవ్, మచ్చ అశోక్, గోనె రవీందర్, సంజీవ్ యాదవ్, సుధాకర్ రెడ్డి, సుధాకర్, శేఖర్, అనీల్, నరేశ్, అఫ్జల్, రాజేశ్, జాడి వేణు, కొండ విజయ్, కమలాకర్, నారాయణ తదతరులు పాల్గొన్నారు. మందమర్రి పట్టణంలోని పాలచెట్టు ఏరియాలో గల పంచముఖి ఆలయం ఆధ్వర్యంలో మిథిల మైదానంలో నిర్వహించిన వేడుకలకు రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా పట్టు వస్త్రాలు, తలంబ్రాలతో హాజరయ్యారు.

వేద పండితులు ఆయనకు శేష వస్త్రాన్ని సమర్పిం చి, పూర్ణకుంభ స్వాగతం పలికారు. రామన్ కాలనీలోని ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో నిర్వహించిన వేడుకలకు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి బోడ జనార్దన్ పూజలు చేశారు. మూడో జోన్ కాశీవిశ్వేశ్వర ఆలయంలో సింగరేణి అధికారులతో పాటు, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ దంపతులు పాల్గొన్నారు. పంచముఖి ఆంజనేయ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే వివేక్ కళశంతో పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులు జే రవీందర్, కొంగల తిరుపతి రెడ్డి, బండారు సూరిబాబు, ఎండీ అబ్బాస్, సీపెల్లి రాజలింగు, భూపెల్లి కనకయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే చెన్నూర్ మండలం సుద్దాలలో ఎమ్మెల్యే వివే క్ పాల్గొన్నారు. సీఐ దేవేందర్ రావు, ఎస్ఐ సుబ్బారావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే భీమారం శ్రీ కోదండ రామాలయాలో ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు. శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, భీమారం ఎస్ఐ శ్వేత బందోబస్తు నిర్వహించారు. ఎస్టీపీపీ కోదండ రామాలయంలో ఎమ్మెల్యే, ఈడీ చెన్నకేశవుల చిరంజీవి, జీఎం శ్రీనివాసులుతో పాటు, పలువు రు అధికారులు పాల్గొన్నారు.

దహెగాంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, ఎమ్మెల్సీ దండే విఠల్ పాల్గొన్నారు. రామకృష్ణాపూర్ పట్టణంలోని కో దండ రామాలయంలో అన్నదాన కార్యక్రమంలో బీఆర్ఎస్ అధ్యక్షుడు, ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, ముస్లింలు అన్నం వడ్డించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ దంపతులు, సింగరేణి అధికారులు, బీఆర్ఎస్ పార్టీ పట్టణ ఇన్‌చార్జి గాండ్ల సమ్మయ్య, మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్ఐ బీ అశోక్, భక్తులు దర్శించుకున్నారు.

కౌటాల బస్టాండ్ నుంచి చింతలమానేపల్లి మండలం కర్జెల్లిలోని ఓంకార ఆశ్రమం వరకు సీతారాముల పల్లకి ఊరేగింపు నిర్వహించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని బృందావనం శ్రీ రాధా కృష్ణ తపోవన ఆశ్రమ పీఠాధిపతి శ్రీ శివరా కృష్ణ, మందమర్రికి చెందిన శ్రీ రామ చంద్ర అవధాని, వరంగల్ తొర్రూర్ ఆశ్రమ పీఠాదిపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థా నం, భద్రాచలం నుంచి పట్టువస్త్రాలు, ము త్యాల తలంబ్రాలు రాగా, తాళ్లపల్లి సత్యనారాయణ గౌడ్, దూస మహేశ్వర్ ప్రసాద్ ఆలయానికి సమర్పించారు.

సీఐ ముత్తే రమేశ్ ఆధ్వర్యంలో ఎస్ఐ మధూకర్ బందోబస్తు ఏర్పాటు చేశారు. జన్నారం మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్వహించిన వేడుకల్లో ఎం రాజశేఖర్, గుండ సుధాకర్, ఎంఆర్ న ర్సింగరావు,

గోలి రాంచందర్‌రెడ్డి, కమలాకర్‌రావు, తనుగుల భూమాగౌడ్, స్వదేశీరావు, జాడి గంగాధర్, కమ్మల విజయధర్మ తదితరులు పాల్గొన్నారు. తాండూర్‌లో సీఐ కుమారస్వామి, తాండూర్, మాదారం ఎస్ఐలు కిరణ్‌కుమార్, సౌజన్య, ప్రజాప్రతినిధులు ఉత్సవాల్లో పాల్గొన్నారు.

కోటపల్లి మండలం కొండంపేటలో మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్ కుమార్ హాజరయ్యారు. ఎస్ఐ రాజేందర్ ఆధ్వర్యంలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. అలాగే కన్నెపల్లి, భీమిని, కెరమెరి, రెబ్బెన, బెజ్జూర్, పెంచికల్‌పేట్, వేమనపల్లి, కాసిపేట, మందమర్రి, చెన్నూర్ మండలాల్లో వేడుకలు నిర్వహించారు.

# రజతోత్సవ సభకు కదం తొక్కుదాం




నకిరేకల్, ఏప్రిల్ 7:అమృత్ తెలంగాణ: కాంగ్రెస్ సర్కారుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వస్తుండడంతో సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ రజతత్సోవ సభను అడ్డుకునేందుకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్-30 అమల్లోకి తీసుకువచ్చారని, ఎన్ని ఆంక్షలు విధించినా సభకు గులాబీ దళంతో కదం తొక్కుతామని, ఆంక్షలను వెంటనే వెనక్కి తీసుకోవాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హెచ్చరించారు. ఏప్రిల్ 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో లక్షలాది మందితో నిర్వహించతలపెట్టిన బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ పోస్టర్‌ను సోమవారం నకిరేకల్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిరుమర్తి మాట్లాడుతూ కాంగ్రెస్‌కు ఓ వైపు పార్టీ సమావేశాలు, మరో వైపు ప్రభుత్వ కార్యక్రమాలకు అనుమతి ఉండొచ్చు కానీ, బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు మాత్రం అనుమతి ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యాన్ని, ప్రతిపక్షాల గొంతు నొక్కే విధంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభను అడ్డుకునేందుకు నెలరోజుల పాటు ర్యాలీలు, సభలు, ఊరేగింపులను నిషేధిస్తున్నట్లు వరంగల్ సీపీ ఉత్తర్వులు జారీ చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. 15 నెలల కాంగ్రెస్ పాలనలో లాఠీదెబ్బలు తినని రంగమేదైనా ఉన్నదా?అని, మీడియా ప్రతినిధులు, సోషల్ మీడియా కార్యకర్తల, న్యాయం కోసం ప్రశ్నించిన ప్రతి సామాన్యుడిపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కేసులు పెడుతుందని విమర్శించారు. ఎక్కడికక్కడ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై సందర్భం లేకుండా కేసులు పెట్టి కక్ష సాధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాలతో పార్టీ నాయకులు, కార్యకర్తలు మహాసభ విజయవంతం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ జడ్పీటీసీ మాదధనలక్ష్మీనగేశ్, మాజీ మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్, బీఆర్ఎస్ నకిరేకల్, కేతేపల్లి మండలాల అధ్యక్షులు ప్రగడపు నవీన్‌రావు, మారం వెంకట్‌రెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ పల్‌రెడ్డి మహేందర్‌రెడ్డి, బీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిల్వేరు ప్రభాకర్, మాజీ ఎంపీటీసీ రాచకొండ వెంకట్‌గౌడ్, నాయకులు సోమ యాదగిరి, పెండెం సదానందం, సామ శ్రీనివాస్‌రెడ్డి, గొర్ల వీరయ్య, యానాల లింగారెడ్డి, పాల్గొన్నారు.

# సోలార్ పవర్ వాడుదాం - పర్యావరణాన్ని రక్షిద్దాం



బుచ్చిరెడ్డిపాలెం అమృత్ తెలంగాణ: ఏప్రిల్ 7 శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు నియోజకవర్గం బుచ్చిరెడ్డిపాలెం మండలం బుచ్చిరెడ్డిపాలెం లో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ సోలార్ పవర్ వినియోగంలో కోవూరు నియోజకవర్గాన్ని రాష్టంలోనే రోల్ మాడల్ గా మారుస్తామన్నారు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సోమవారం ఆమె ఇందుకూరు మండలలోని కుడితి పాళెం గ్రామంలో ఆమె 2 కోట్ల 77 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న 33/ 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారం లోనికి వచ్చాక కోవూరు నియోజకవర్గంలో విద్యుత్ శాఖలో 90 కోట్లు వెచ్చించి కొత్తగా త్రీ ఫేస్ పవర్ లైన్స్, 33 కేవీ లైన్స్, అదనపు ట్రాన్స్ ఫార్మర్స్ ఏర్పాట్లు లాంటి ఆధునీకరణ పనులు చేపట్టామన్నారు. కోవూరు నియోజకవర్గానికి రెండు విద్యుత్ సబ్ స్టేషన్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవి కుమార్ కు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ధన్యవాదాలు తెలియచేసారు. కుడితి పాళెం గ్రామంలో సబ్ స్టేషన్ నిర్మాణం వెనుక ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సహకారం దువ్వూరు కళ్యాణ్ రెడ్డి చొరవ వుందన్నారు. నిరంతర త్రీ ఫేస్ విద్యుత్ సరఫరాతో కుడితిపాలెం పరిసర ప్రాంతంలో ఇకపై అర్ధాంతరంగా పవర్ ట్రిప్ కావడం, లోవోల్టేజ్ కారణంగా మోటార్లు కాలిపోయి రైతులు నష్టపోయే పరిస్థితులు తలెత్తవున్నారు. ఈ సబ్‌స్టేషన్ నిర్మాణం అక్కా రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. అధికారంలోనికి వచ్చిన పది నెలల కాలంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గుంతల రహిత రోడ్ల ఆంధ్రప్రదేశ్ గా మార్చారన్నారు. ధాన్యం అమ్మిన 24 గంటలలో రైతుల ఖాతాలలో డబ్బులు వేసి ఆదుకున్న మంత్రి నాదెండ్ల మనోహర్, జిల్లా కలెక్టర్ కు ఆమె ధన్యవాదాలు తెలియచేసారు. సాంప్రదాయ విద్యుత్ వినియోగానికి ప్రత్యామ్నాయంగా ప్రతి ఇంట్లో సోలార్ పవర్ పవర్ వినియోగించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని పిలుపునిచ్చారు. "ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలి" పథకంలో భాగంగా ఎస్సి, ఎస్టీలకు సోలార్ యూనిట్లకు కేంద్ర ప్రభుత్వం 100శాతం సబ్సిడీ ఇస్తుందన్నారు. సోలార్ విద్యుత్తు ప్రోత్సాహకాల్లో భాగంగా బిసిలకు కేంద్ర ప్రభత్వం యిచ్చే 60 వేల సబ్సిడీతో పాటురాష్టం మరో ఇరవై వేలు ఇస్తుందన్నారు. కేంద్ర, రాష్ట ప్రభత్వాలు యిచ్చే సబ్సిడీలు సద్వినియోగం చేసుకొని ప్రజలు సోలార్ విద్యుత్ వినియోగం వైపు మొగ్గ చూపాలన్నారు.సోలార్ పవర్ వినియోగంపై గ్రామాలలో చదువుకున్న యువత పెద్దలకుఅవగాహన కల్పించాలన్నారు. కోవూరు నియోజకవర్గంలో విద్యుత్ శాఖ అధికారుల పనితీరు పట్ల ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి సంతృప్తి వ్యక్తం చేసారు. పదిహేనేళ్లుగా విద్యుత్ సదుపాయం లేని గుమ్మళ్ళదిబ్బలో వందకు పైగా స్తంబాలు వేసి యుద్ధప్రాతిపదికన విద్యుత్ కనెక్షన్స్ యిచ్చిన ట్రాన్స్కో సిబ్బందిని ఆమె అభినందించారు. రెండు నెలల్లో సబ్ స్టేషన్ నిర్మాణాన్ని పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను, కాంట్రాక్టర్ ను కోరారు. ఈ కార్యక్రమంలో ఎపి ట్రాన్స్కో ఎస్ ఇ విజయన్, డి ఇ రమేష్ చౌదరి, ఇందుకూరుపేట మండల టిడిపి అధ్యక్షులు వీరేంద్ర నాయుడు, టిడిపి నాయకులు దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, బెజవాడ వంశీకృష్ణా రెడ్డి, మల్లికార్జున, చెంచుకిషోర్ యాదవ్, స్థానిక నాయకులు అప్పాని శ్రీనివాసులు,పి ఎల్ రావు, ఇంతియాజ్ జనసేన నాయకులు గుడి హరికుమార్ రెడ్డి పాల్గొన్నారు.

# జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించండి



నంద్యాల:అమృత్ తెలంగాణ:జూటూరు వద్ద ఉన్న జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సోమన్న పుల్లా నరసింహ జిల్లా అధికారులను కోరారు. పాములపాడు మండలంలోని జూటూరు దగ్గర ఉన్న జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని సోమవారము కలెక్టరేట్ లోని పి జి ఆర్ ఎస్ లో సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు జిల్లా అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యులు డి సోమన్న, పుల్లా నరసింహ మాట్లాడుతూ 2019 లో జగనన్న కాలనీల పేరుతో జూటూరు పొలిమేరలో ఊట వాగు దగ్గర ఐదు గ్రామాలకు సంబంధించి 350 కుటుంబాలకు ఇంటి పట్టాలు ఇవ్వడం జరిగిందని, వాటిలో కొన్ని ఇల్లు నిర్మాణం పూర్తి అవ్వడంతో జగనన్న కాలనీలో నివాసం ఉంటున్నారని, ఇంకా కొన్ని నిర్మాణము జరుగుచున్నయని తెలిపారు. ప్రస్తుతం జగనన్న కాలనీలలో నివాసం ఉంటున్న వారు సమస్యలతో సతమతమవుతున్నారని తెలిపారు. కనీసం మౌలిక వసతులు సిసి రోడ్లు, మంచినీళ్లు, వీధి లైట్లు లేకపోవడం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. జగనన్న కాలనీ వద్ద బస్టాప్ లేకపోవడంతో ప్రజలు దూరం వెళ్లాల్సి వస్తుందన్నారు.,

డివైడర్ ను, ముళ్లపదలను తొలగించాలని కాలనీ లో సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరారు. లేని పక్షంలో నివాసిత ప్రజలతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. వినతిపత్రం సమర్పించిన వారిలో కాలనీవాసులు సుశీలమ్మ,రవి గౌడు,వెంకటేశ్వర్లు, సుభద్రమ్మ, రజియా, రహమదియా తదితరులు ఉన్నారు.

# ఆరోగ్యమే మహాభాగ్యం .. పల్లెల్లో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ర్యాలీ




ఆలమూరు (కోనసీమ) :అమృత్ తెలంగాణ:శారీరక శ్రమ, మానసిక ఉల్లాసంతోనే పరిపూర్ణమైన ఆరోగ్య, జీవన భాగ్యాన్ని సాధించవచ్చునని పీహెచ్ సి వైద్యాధికారులు డి.సాయికిషోర్, కె.శ్రీకాంత్ లు అన్నారు. మండలంలోని చొప్పెళ్ల, పెదపళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ ప్రపంచ మానవాళి ఆరోగ్య రక్షణ హక్కు కోసం 1948 ఏప్రియల్ 7న డబ్ల్యూహెచ్ఓ నెలకొల్పిన ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని ప్రతియేటా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. డబ్ల్యూహెచ్ఓ పిలుపు మేరకు కొత్తపేట డివిజన్ అదనపు జిల్లా వైద్యాధికారి ఎం.సుమలత ఆదేశాలతో వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఆరంభాలు ఆశాజనక భవితవ్యాలు అంటూ నినాదాలు చేసారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ఆవశ్యకతను వివరిస్తూ ప్రజలను చైతన్యవంతం చేశారు. అలాగే మండలంలోని ఆయా గ్రామాల్లోని ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిరాల పరిధిలో వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు.

# చెత్త నుండి సంపద సృష్టి పనులు వేగవతం



ఆలమూరు :అమృత్ తెలంగాణ: చెత్త నుండి సంపద సృష్టి పనులు వేగవంతం చేశామని ఇన్చార్జి డిఎల్పిఓ, ఎంపీడీవో ఐ.రాజు అన్నారు. మండలంలోని నవాబుపేట, జొన్నాడ, చెముడులంక గ్రామ పంచాయతీలలో ఇంటింటికీ చెత్త సేకరణపై సోమవారం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బందికి చెత్త నుండి సంపద తయారీపై ఇప్పటికే శిక్షణ కార్యక్రమం నిర్వహించామన్నారు. అలాగే తడి చెత్త, పొడి చెత్త సేకరించే విధానాన్ని మండలంలో గల ప్రజలకు క్షేత్రస్థాయిలో అవగాహన కూడా కల్పించడం జరిగిందన్నారు. అలాగే సేకరించిన చెత్త నుండి సంపద ఏ విధంగా తయారు చేయాలనే అంశంపై ప్రత్యేక శిక్షణ మండల పరిధి అన్ని గ్రామాల పంచాయతీల సిబ్బందికి ఇచ్చామన్నారు.

# వ్యాట్ డేనియల్ లవర్ ఇంతందంగానా?



2021లో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ బ్లాక్ బస్టర్ హిట్ 'భీమ్లా నాయక్'తో టాలీవుడ్ లో అడుగుపెట్టింది సంయుక్త మీనన్. ఇందులో ఆమె రానా దగ్గుబాటి సరసన కథానాయికగా నటించింది. అందానికి అందం నటప్రతిభ ఉన్న నాయికగా పేరు తెచ్చుకుంది. డేనియల్ (రానా) వైఫ్ పాత్రలో డైనమిక్ నటనకు ప్రశంసలు అందుకుంది. 2022లో పృథ్వీరాజ్ 'కడువ'తో బ్లాక్ బస్టర్ ని అందుకుంది. ఇప్పుడు ధనుష్ ద్విభాషా చిత్రం వాతి .. కళ్యాణ్ రామ్ పాన్ ఇండియా మూవీ 'బింబిసార'.. కన్నడలో గాలిపాట 2 చిత్రాల్లో నటిస్తోంది. కెరీర్ పరంగా క్షణం తీరిక లేనంత బిజీ అయిపోయింది సంయుక్త. 2016లో పాప్ కార్న్ చిత్రంతో సినీ రంగ ప్రవేశం చేసిన సంయుక్త సూపర్ హిట్ చిత్రం 'తీవండి'లో తన నటనతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. 2021లో వెల్లం-ఆనుమ్ పెన్నుమ్ చిత్రాలతో నెమ్మదిగా నిలదొక్కుకుంది. సంయుక్త కేరళ ఫిల్మ్ క్రిటిక్స్ ఉత్తమ నటి అవార్డును అందుకుంది. భీమ్లా నాయక్ - కడువ లాంటి బ్లాక్ బస్టర్ చిత్రాలు తనని గోల్డెన్ లెగ్ గా మార్చాయనడంలో సందేహం లేదు. సంయుక్తకు వరుస అవకాశాలు వస్తున్నాయి. ఇక ఇదే అదనుగా ఈ బ్యూటీ కూడా సోషల్ మీడియాల్లో వరుస ఫోటోషూట్లతో అదరగొడుతోంది.

# కేతిక రాంగ్ టైమ్ లో అడుగుపెట్టిందా?



కేతిక ఇండస్ట్రీలోకి వచ్చి ఇప్పటికే నాలుగేళ్లవుతుంది. కానీ ఇప్పటివరకు అమ్మడికి సాలిడ్ హిట్ పడింది లేదు. పూరీ జగన్నాధ్ కొడుకు పూరీ ఆకాష్ హీరోగా నటించిన రొమాంటిక్ సినిమాతో హీరోయిన్ గా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన కేతిక శర్మ ఆ సినిమా డిజాస్టర్ గా నిలవడంతో పెద్దగా హైప్ తెచ్చుకోలేకపోయింది. కేతిక ఇండస్ట్రీలోకి వచ్చి ఇప్పటికే నాలుగేళ్లవుతుంది. కానీ ఇప్పటివరకు అమ్మడికి సాలిడ్ హిట్ పడింది లేదు. ఇవన్నీ చూస్తుంటే కేతిక ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన టైమ్ కరెక్ట్ కాదనిపిస్తోంది. నాలుగేళ్లుగా సినిమాలు చేస్తున్నప్పటికీ ఒక్కటి కూడా సక్సెస్ ఇవ్వకపోవడమేంటని అందరూ ఆశ్చర్యపోతున్నారు. ఆఖరికి కేతిక రీసెంట్ గా రాబిన్‌హుడ్ సినిమాలో చేసిన ఐటెమ్ సాంగ్ కూడా ఆమెకు కోరుకున్న సక్సెస్ ను ఇచ్చి, తన కెరీర్ కు బ్రేక్ ఇవ్వలేకపోయింది. రొమాంటిక్ సినిమా తర్వాత కేతిక, నాగశౌర్యతో కలిసి చేసిన లక్ష్య, వైష్ణవ్ తేజ్ తో కలిసి చేసిన రంగ రంగ వైభవంగా కూడా బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్లుగా నిలిచాయి. దీంతో తన ఆశలన్నీ ఆమె కెరీర్లోనే నటించిన బిగ్గెస్ట్ ప్రాజెక్ట్ అయిన బ్రో సినిమాపై పెట్టుకుంటే ఆ సినిమా కూడా తన ఆశలపై నీళ్లు చల్లుతూ బాక్సాఫీస్ వద్ద ఫెయిలైంది. బ్రో సినిమా తర్వాత టాలీవుడ్ దర్శకనిర్మాతలు కేతికను పట్టించుకోవడం మానేశారు. హీరోయిన్ గా పాత్రలు తగ్గిపోవడంతో కేతిక రాబిన్‌హుడ్ లో ఐటెమ్ సాంగ్ కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి ఆ సాంగ్ చేసింది. ఆ సాంగ్ లోని కేతిక బోల్డ్ మూవ్స్ సోషల్ మీడియాలో కాంట్రవర్సీ అయినప్పటికీ, ఆ సెన్సేషనల్ సాంగ్ కూడా అమ్మడి కెరీర్ కు ఏ మాత్రం ఉపయోగపడలేకపోయింది.

# అమృత్ తెలంగాణ సినిమా వార్తలు

## ఈ లుక్ కోసం 10ఏళ్లు శ్రమించిన సింగర్



ఇటీవలి కాలంలో గాయనీగాయకులు కూడా ఫిట్ నెస్ ఫ్రీక్ లు గా మారుతున్నారు. అందాల కథానాయికలకు ధీటుగా తమదైన గ్లామర్ తో ఓలలాడిస్తున్నారు. హీరోయిన్లతో పోలిస్తే టూ హాట్ గా కనిపించే గాయనీమణులకు కొదవేమీ లేదు. ఇక పాప్ గాయనిగా పాపులరైన నేహాభాసిన్ పరిచయం అవసరం లేదు. జగ్ ఘూమేయా (సుల్తాన్) .. ధుంకీ (మేరే బ్రదర్ కి దుల్హన్).. పర్వా వంటి చార్ట్ బస్టర్ సాంగ్స్ పాడిన గాయనిగా తనకంటూ ఒక బ్రాండ్ ఇమేజ్ ఉంది. బ్యాండ్ మేనేజ్ మెంట్ సమయంలో తన ఫ్యాటీ స్టమక్ ని చూస్తూ చాలా సిగ్గుపడేదానిని అని నేహా ఇప్పుడు మరోసారి గుర్తుచేసుకుంది. అందాన్ని కాపాడుకునేందుకు గాయణీమనులు కూడా చాలా చేయాలి. నిరంతరం జిమ్ యోగా అంటూ పెద్ద షెడ్యూల్ ని క్రమం తప్పకుండా పాటించాలి. అప్పుడు మాత్రమే టోన్డ్ ఫిజిక్ ని మెయింటెయిన్ చేయగలరు. చాలా ఏళ్లుగా శ్రమించి నేహాభాసిన్ తన రూపాన్ని ఇప్పటికి మార్చుకోగలిగింది. మునుపటిలా బాన పొట్టతో కనిపించడం లేదు. పూర్తిగా టోన్డ్ ఫ్లాట్ స్టమక్ తో కనిపిస్తోంది. ఫిట్ బాడీతో గుబులు పుట్టిస్తోంది. ఇక తాజా ఇంటర్వ్యూలో నేహా కొన్ని సంచలన విషయాలను వెల్లడించింది. సరైన ఆకృతిలో నా పొట్ట లేనందున నేను అంతర్జాతీయ పాప్ స్టార్ ని కాలేనని అనుకునేదానిని అంటూ తన నిరాశ గురించి వెల్లడించింది. ఒకప్పుడు నేహా భాసిన్ పొట్టను చూసి వెక్కిరించేవారట. ఆమె కెరీర్ ప్రారంభ దశలో వెక్కిరింతలు.. అనుచిత వ్యాఖ్యల కారణంగా తాను చాలా మారానని తెలిపింది. బొద్దుతనం వల్ల అనారోగ్యం కూడా వెంటాడేదని వెల్లడించింది. ఇప్పుడు అద్భుతమైన రూపంతో ఆరోగ్యంగా ఉన్నందుకు సంతోషంగా ఉంది. అంతేకాదు తన శరీరాన్ని ఇలా మార్చుకోవడానికి లేదా మలుచుకోవడానికి ఏకంగా ఆమెకు ఒక దశాబ్దం పట్టిందట. నేను 2002లో %ఎ×వాూ%తో నా కెరీర్ ని ప్రారంభించినప్పుడు ముఖ్యంగా మేనేజ్ మెంట్ లో చాలా బాడీ షేమింగ్ ఎదుర్కొన్నాను. ఆ తరువాత నేను 10 సంవత్సరాలు నా బరువు సమస్యల వల్ల చాలా అనారోగ్యం ఎదుర్కొన్నాను. నా శరీరాన్ని రూపాన్ని అంగీకరించేందుకు నిరంతరం పోరాడాను. నా మనసులో ఇవన్నీ పాతుకుపోయాయి" అని నేహా భాసిన్ చెప్పారు.

# ఇస్మార్ట్ బ్యూటీ సినిమా కష్టాలు..!



నన్ను దోచుకుందువటే సినిమా తో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ నభా నటేష్. హీరోయిన్ గా మొదటి సినిమాతోనే మంచి మార్కులు దక్కించుకుంది. సుధీర్ బాబు కు జోడీగా ఆ సినిమా లో నటించిన నభా నటిగా విమర్శకుల ప్రశంసలు దక్కించుకోవడం తో పాటు పెద్దల యొక్క చూపు పడేలా చేసింది. ఆ సినిమా తర్వాత బ్యాక్ టు బ్యాక్ ఆఫర్లు వచ్చాయి. అనూహ్యంగా నభా నటేష్ యొక్క ప్రతిభ గుర్తించిన డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాద్ ఏకంగా ఇస్మార్ట్ శంకర్ సినిమాలో ఛాన్స్ ఇచ్చాడు. ఆ సినిమా సూపర్ హిట్ అవ్వడం మాత్రమే కాకుండా ఇస్మార్ట్ పోరీగా నభా నటించిన తీరు అందరిని ఆకట్టుకుంది. హీరోయిన్ గా ఆ సినిమా తో కమర్షియల్ హీరోయిన్ గా ఈ అమ్మడు నిలదొక్కు కోవడం ఖాయం అనుకుంటూ ఉండగా అనూహ్యంగా ఈ అమ్మడి కెరీర్ కు కరోనా కష్టం వచ్చి పడింది. వరుసగా సినిమాల్లో ఆఫర్లు వస్తాయని భావిస్తున్న సమయంలో అనూహ్యంగా కరోనా వల్ల మొత్తం సీన్ రివర్స్ అయ్యింది. కాస్త గ్యాప్ రావడంతో ఈ అమ్మడిని జనాలు మాత్రమే కాకుండా సినీ వర్గాల వారు కూడా పక్కన పెట్టేసినట్లుగా ఉన్నారు. అందుకే ఈమధ్య కాలంలో ఈ అమ్మడు కనీసం ఒక్కటి రెండు చిన్నా చితకా ఆఫర్లను కూడా దక్కించుకోలేక పోతుంది అల్లుడు అదుర్స్ మరియు మాస్ట్రో సినిమాల్లో నటించిన ఈ అమ్మడు కమర్షియల్ గా మళ్లీ బ్రేక్ ను దక్కించుకోలేక పోయింది

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com